యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం

- రికార్డులకే పరిమితమైన నిషేధం
- అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం

పెదవేగి : పట్టువదలని విక్రమార్కుడి భుజంపై మళ్లీ మళ్లీ ఎక్కే బేతాళుడిలా ప్లాస్టిక్ అందరిపైనా స్వారీ చేస్తోంది. ప్లాస్టిక్ నిషేధం ఉత్తర్వులు ఎక్కడా పూర్తిస్థాయిలో అమలైన జాడ లేదు. దాంతో ప్లాస్టిక్ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. డ్రెయినేజీల్లో వచ్చే పూడికల్లో ఎక్కువ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ పరిధిలో ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలనే ప్రభుత్వాదేశాలు రికార్డులకే పరిమితమయ్యాయి. నియోజక వర్గ పరిధిలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అధికారులు ఆకస్మిక దాడులు చేస్తూ ప్లాస్టిక్ విక్రయించే వారిపై భారీగా జరిమానాలు విధించేవారు. కొంత కాలానికి అధికారులు మిన్నకుండిపోవడంతో మళ్లీ కొందరు ప్లాస్టిక్ విక్రయాలను మొదలు పెట్టారు. హ్యాండ్లింగ్ ప్లాస్టిక కవర్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 2011 నిబంధనల ప్రకారం మండల పంచాయతీ కార్యదర్శులు వ్యాపార దుకాణాలు, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 40 మైక్రాన్ల కంటే


ఇళ్ల మధ్య ఉన్న మురుగునీటి నిల్వల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు


కవర్లలో సామాన్లు తీసుకువెళ్తున్న దృశ్యం

తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుంటే చర్యలు తీసుకోవాలి. అక్కడికక్కడే వాటిని వినియోగిస్తున్న వారిపై జరిమానాలు విధించి వాటిని స్వాధీనం చేసుకుని నాశనం చేయాలి. అయితే ఆ నిబంధనలు పటిష్టంగా అమలు కావడం లేదు. విచ్చలవిడిగా వాటి వినియోగమే కాదు. రీసైక్లింగ్ కూడా జరుగుతోంది. వీటి వినియోగం పర్యావరణానికి చాలా ప్రమాదకరమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ అవగాహన లోపంతో ప్రజలు వీటిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

అధికారుల ఉదాసీనతే కారణం

ఈ మధ్యనే మళ్లీ ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధిస్తూ పంచాయతీ శాఖ చర్యలు చేపట్టింది. అయినా గ్రామాల్లో ఏ దుకాణం చూసినా ఏ హోటల్‌లో చూసినా, ఏ చెత్తకుప్ప, మురుగుకాలువను చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. కొందరు వ్యాపారులు కవర్లు లేవంటున్నారు. వినియోగదారులు వస్తువులు వదిలి వెళ్లిపోతుంటే కవరు ఇస్తున్నారు. కవర్లు లేకపోతే తమకు వ్యాపారం జరగడంలేదని, వినియోగదారులు ఏ విధమైన సంచులు తీసుకురాకుండా వచ్చి వెళ్లిపోతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో చెత్తలో కేవలం ఐదు శాతం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తుంటే ఆరు నెలలుగా 30 నుంచి 40 శాతం వరకూ ఇవే ఉంటున్నాయి. ఏ చెత్తకుప్ప చూసినా, మురుగు కాలువను చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి కన్పిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే నిషేధం అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


కొవ్వలిలో ఉపాధి కూలీల మస్తర్లను తనిఖీ చేస్తున్న మండల ఏపీఓ దశరథ రామ్‌జీ

దెందులూరు: గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య మరింత పెరగాలని మండల ఏపీఓ దశరథ రామ్‌జీ అన్నారు. బుధవారం కొవ్వలి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీల మస్తర్లను, హాజరైన కూలీల సంఖ్యతో పోల్చి చూశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, ఉపాధి కూలీల సంఖ్య, వారికి కల్పిస్తున్న సౌకర్యాలను ఏపీఓకు వివరించారు.

రేపు కల్నల్ రాకకు ఏర్పాట్లు ముమ్మరం


దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ కల్నల్ రాక సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ కల్నల్ యాకుబ్ మసీ, సుమిత్రా మసీ శుక్రవారం దెందులూరు గ్రామానికి విచ్చేస్తున్నారని సాల్వేషన్ ఆర్మీ దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కే.రమణయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. దెందులూరులో 125 ఏళ్ల రక్షణ సైన్య ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన దెందులూరు సాల్వేషన్ ఆర్మీ ప్రార్థనా మందిరం పునర్నిర్మాణానికి జరగనున్న శంకుస్థాపన కార్యక్రమానికి కల్నల్‌లు విచ్చేస్తున్నారన్నారు. గత రెండు రోజులుగా సాల్వేషన్ ఆర్మీ కోర్ పరిధిలో సంఘ పెద్దలు, సంఘస్తులు, యువత, గృహ సమితి సభ్యులు, పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను చేస్తున్నారని కోర్ ఆఫీసర్ రమణయ్య అన్నారు.

వసంతవాడలో లారీ బోల్తా


బోల్తా పడ్డలారీ

పెదపాడు: ధాన్యం లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని వసంతవాడ గ్రామంలో అన్నపూర్ణ సీడ్స్ నుంచి మండపేట సమీపంలోని రామచంద్రపురానికి ధాన్యం లోడుతో వెళ్తున్న ఐసర్ వ్యాన్ వసంతవాడ శివారు ప్రాంతంలో రాత్రి 10 గంటల సమయంలో తిరగబడింది. దీంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అతనిని వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గొప్ప సంఘ సంస్కర్త రామ్మోహన్ రాయ్

ఏలూరు (టూటౌన్): రాజారామ్మోహన్ రాయ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత తెలుగు భాష ఉపాధ్యాయిని ఏబి త్రిపుర సుందరి అన్నారు. స్థానిక వపరుపేటలోని అన్నే భవన్‌లో కంప్యూటర్ సెంటర్ నందు రాజారామ్మోహన్‌రాయ్ 252వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి త్రిపుర సుందరి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా త్రిపుర సుందరి మాట్లాడుతూ నేటి విద్యార్థులు గత కాలపు త్యాగ జీవులు, మార్గదర్శకులు చేసిన కృషి, వారి త్యాగాలు తెలుసుకునే ఆసక్తి కలిగించడం కోసం ప్రయత్నంలో భాగంగా విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ లక్ష్మి, సిద్ధార్థ సాయి, జ్ఞానేశ్వరి, సుజీవ్,ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

భీమడోలు: వినియోగదారుల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ లక్ష్యమని జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అనంతరం జరిగిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులు, బాధ్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ, ఏలూరు డివిజనల్ ఇంచార్జి సత్యేంద్ర, మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావులు పాల్గొని ప్రసంగించారు. వినియోగదారుడా మేలుకో, హక్కులు, బాధ్యతలు తెలుసుకో అంటూ నినాదాలు చేశారు. టీవీ


వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సులో నినాదాలు చేస్తున్న జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ


ఉంగుటూరు గ్రంథాలయంలో పుస్తకాలు అందిస్తున్న సర్వేశ్వరరావు

ఉమామహేశ్వరరావు చిన్నారులకు ఇంగ్లిషు భాషపై పట్టు సాధించేలా గ్రామర్‌పై శిక్షణ అందించారు. నీతి కథలు, జీకే అంశాలు, పుస్తక సమీక్షలు చేశారు. గుల్లా నూకరాజు పాల్గొన్నారు.

పోటీపరీక్షలకు సలహాలు ఇస్తా

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విజయవాడ ఐఐటీ, జేఈఈ మెయిన్స్ కోచింగ్‌లో అనుభవం ఉన్న సీనియర్ అధ్యాపకుడు సీహెచ్‌ఎస్ సర్వేశ్వరరావు విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. బుధవారం గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి సూచనలు సలహాలు అందజేస్తానని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే అనేక పుస్తకాలను శాఖాగ్రంథాలయానికి అందించారు. ఈ కార్యక్రమంలో తల్లాప్రగడ భీమేశ్వరరావు, పాతూరి వంశీకృష్ణ, కోసూరి సూర్యనారాయణ, గ్రంథపాలకుడు గంగాధరరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


రామారావుగూడెంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: మండలంలో రామారావుగూడెం, శ్రీరామవరం గ్రామాల్లో మృతుల కుటుంబాలను వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, రామారావుగూడెం గ్రామ సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ పరామర్శించారు. రామారావుగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పేరం కృష్ణ కుటుంబ సభ్యులు పేరం ప్రసాద్, పేరం రామకృష్ణలను పరామర్శించారు. శ్రీరామవరంలో మృతి చెందిన చిలకా మెరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట రామారావుగూడెం, శ్రీరామవరం గ్రామ కమిటీ అధ్యక్షులు పర్వతనేని వెంకట్రాజు, అక్కినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కాలి ఇజ్రాయేలు, పార్టీ నాయకులు పర్వతనేని నరేంద్ర, బాబ్జి, పుల్లా వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

ద్వారకాతిరుమల: శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, సిబ్బంది బుధవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ పట్టు వస్త్రాలను చినవెంకన్న దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజులకు అందజేశారు.

మెడికల్ కిట్ల అందజేత

శ్రీవారి దేవస్థానం ప్రాణదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి విజయవాడకు చెందిన రాఘవన్ మూడు ఫస్ట్ ఎయిడ్ కిట్లు, రెండు డిజిటల్ బీపీ మెషిన్‌లు, రెండు డిజిటల్ షుగర్ మెషిన్‌లను బుధవారం అందజేశారు.

తడి, పొడి విధానంతో అధిక దిగుబడులు

భీమడోలు: వరి సాగులో తడి, పొడి విధానాన్ని అవలంభిస్తే అధిక దిగుబడులతో పాటు భవిష్యత్ తరాలకు సాగునీరు అందించిన వారమవుతారని వ్యవసాయ శాఖ భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజ కుమారి అన్నారు. భీమడోలులో బుధవారం యాక్సిస్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహణలో మిట్టి ల్యాబ్స్, కార్బన్ క్రెడిట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త దాధ్వర్యంలో జిల్లాలోని రైతులకు ప్రత్యామ్నాయ తడి- పొడి విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఏ పి.ఉషారాజ కుమారి మాట్లాడుతూ సాగునీటిని పొదుపుగా వాడుకుంటే వరి పంట దిగుబడులు సాధించడంతో పాటు రాబోయే తరాలకు నీటిని అందించిన వారమవుతామన్నారు. ఈ విధానాన్ని రైతులు అవలంభించేలా సంస్థ ప్రతినిధులు కృషి చేయాలని వారికి ఆర్‌బీకే సిబ్బంది సహాయ సహకారాలను అందిస్తున్నారన్నారు. రైతులు వరి పండించడానికి 75 నుంచి 80 శాతం నీటిని వినియోగిస్తున్నారన్నారు. తద్వారా పంట దిగుబడులు తగ్గుతాయని, కానీ తడి, పొడి విధానం వల్ల దిగుబడులు కూడా పెరుగుతాయని


భీమడోలులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులు అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవసాయ యాంత్రీకరణపై రైతులు మొగ్గు చూపుతున్న విధంగా నీటి యాజమాన్యం విధానంలోను మార్పు రావాలని కోరారు. మిట్టి ల్యాబ్ ప్రతినిధి బెంజమన్ మ్యాథ్యూ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 7 వేల హెక్టార్లుకు తడి, పొడి సేద్యం చేసేలా తగు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రాజెక్టు పరిధిలో భీమడోలు, నల్లజర్ల, లింగపాలెం చింతలపూడి, ముసునూరు మండలాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. భీమడోలు, ద్వారకాతిరుమల, నల్లజర్ల ఏవోలు ఉషారాణి, దుర్గారమేష్, కమల్‌రాజ్, ఉద్యావనాధికారి దేవదానం తదితరులు రైతులకు సాగునీటిని పొదుపుగా వాడుకుంటే ఉత్తమ ఫలితాలు పొంది ఆర్థిక పరిపుష్టిని సాధిస్తారన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ సుబ్బారావు, సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కాశేశ్వరరావు, భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శ్రీక్రోధి నామసంవత్సరం వైశాఖ ఏకాదశి నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణతంతు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, మోహన్‌కృష్ణాచార్యులు, సుధీరాచార్యులు కల్యాణ క్రతువు ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత వినాయకుని గుడి వద్ద ఎదుర్కోలు సన్నాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద మొగళ్లబాబు బంగారు లక్ష్మీ, నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అక్కడ నుంచి కల్యాణ మండపం వద్దకు స్వామి, అమ్మవార్లను మేళతాళాలతో నడుమ ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. పురోహితుల వేద మంత్రాలతో మేళ తాళాలతో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు దంపతులు అదనపు రాష్ట్ర కార్యదర్శి మామిళ్లపల్లి


ఆలయంలో స్వామి వారికి పూజలు చేస్తున్న పూజారులు, ఆలయ ట్రస్టీ చైర్మన్ దంపతులు

కాశీకుమార్, భీమడోలు సీఐ బీబీ రవికుమార్, ఎస్సై వై.సుధాకర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వగ్వాల భాస్కర్, మామిళ్లపల్లి కాశీబాబు, నీలం రాంబాబు, ఆలయ ఈవో కేఎం వంశీ, భక్తులు పాల్గొన్నారు.


ఎదుర్కోలు సన్నాహంలో పూజలు చేస్తున్న దృశ్యం

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: మండలంలో దెందులూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33 /11 కేవీ గాలాయగూడెం సబ్‌స్టేషన్ మరమ్మతులు చేయడానికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేవీబీబీ నటరాజన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండంలోని గోపన్నపాలెం, సానిగూడెం, కొత్తపల్లి, చల్లపల్లి, అలుగులగూడెం, వేగవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్ల అందజేత

ఉంగుటూరు: మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఈ నెల 24 నుంచి జరగబోయే సప్లిమెంటరీ పరీక్షలకు ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాసేందుకు హాలు టికెట్లు గురువారం నుంచి అందజేస్తున్నట్లు ప్రిన్సిపాల్‌బి వి..శ్రీనివాసు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్షలు రాసే ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటలు వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలు వరకు పరీక్షలు నిర్వహిస్తారని స్పష్టం చేశారు. విద్యార్థులు హాల్ టికెట్ల కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వ్యాన్ డ్రైవర్‌పై కేసు

భీమడోలు: అంబర్‌పేట గ్రామంలో ప్రజలు, రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కరెంట్ స్తంభాలను మంగళవారం రాత్రి ఓ బొలెరో వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి వాటిని ధ్వంసం చేశాడు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన బొలెరో వ్యాన్ డ్రైవర్‌పై భీమడోలు విద్యుత్ శాఖ ఏఈ రామస్వామి భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రైవర్‌పై భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు

ఉంగుటూరు: మండలంలో ఎవరైనా రైతులు అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకట శివయ్య పేర్కొన్నారు. మట్టి తవ్వకాల జరుగుతున్నాయని వచ్చిన ఆరోపణలపై తహసీల్దార్ వెంకటశివయ్య బుధవారం తల్లాపురం, చేబ్రోలు, కైకరం ఆయకట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఆయా గ్రామాల వీఆర్‌ఓలను అప్రమత్తం చేశారు. మట్టి తవ్వకాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తాహిసిల్దారు వెంకటశివయ్య తెలిపారు. రైతు వారిలో పొలంలో ఎత్తు పల్లాలు సరిచేసుకునే పనులు చేస్తున్నారే తప్ప ఎక్కడ కు బయటకు ఒక్క ట్రాక్టరు కూడా వెళ్లడం లేదని తహసీల్దార్ పేర్కొన్నారు. ఆయన వెంటన కైకరం వీఆర్‌ఓ శ్రీనివాసరావు, ఆర్‌ఐ సత్యనారాయణ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: క్షణికావేశంలో గుళికలు తిని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామంలో చోటు చేసుకుంది. అతను చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే ఎంఎంపురం గ్రామానికి చెందిన పూనూరి నాగేశ్వరరావు(52) అనే వ్యక్తికి మద్యం సేవించే అలవాటుతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం భార్య పార్వతి మద్యం తాగవద్దని మందలించింది. మనస్తాపానికి గురైన నాగేశ్వరరావు క్షణికావేశంలో గుళికలు తిగి అపస్మారక స్థితిలో చేరాడు. గుర్తించిన కుటుంబసభ్యులు నాగేశ్వరరావును వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ఎన్నికల పేరుతో ప్రజా సమస్యలను వదిలేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి అన్నారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. శుభ్రమైన మంచి నీరు లేక గిరిజనులు అతిసార, వ్యాధులు, విషజ్వరాలు బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ అంబులెన్స్‌లు రన్నింగ్‌లో లేకపోవడం వల్ల సకాలంలో గిరిజన గూడెం ప్రజలకు వైద్యం అందటం లేదన్నారు. ఉపాధి కూలీల బకాయిలు జమ చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల పరిణామాలను వివరించారు. కనీసం అధికారులైన ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. ఈసమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి ప్రసాద్, పి.కిషోర్,ఆర్ లింగరాజు, జి.రాజు,ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు జి.నరసింహారావు, కె.శ్రీనివాస్, పివిరామకృష్ణ, బి.సోమయ్య, ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, టి.ముత్యాలమ్మ, యెన్ నరసింహా, ఏ.ఫ్రాన్సిస్, టి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

పెదవేగి: దీర్ఘకాలంగా వస్తున్న కడుపునొప్పిని తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం ముండూరు శివారు బొడ్డువారిగూడేనికి చెందిన వివాహిత బడుగు ధనలక్ష్మి (40) చాలాకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం మధ్యాహ్నం తీవ్రమైన నొప్పి రావడంతో తట్టుకోలేక ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని శవపరీక్షకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. అయితే ధనలక్ష్మి మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉరి వేసుకుంటే మృతదేహం వేలాడుతూ ఉండాలి కానీ, ధనలక్ష్మి చేతులు నేలను తాకేలా ఉన్నాయని, ఇది ఆత్మహత్యకాదని, హత్యేనని ప్రచారం జరుగుతోంది. మృతురాలి కుమారుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేంద్రప్రసాద్ చెప్పారు.